అప్రమత్తత అవసరం

బర్డ్ ఫ్లూతో భయం భయం

- విపరీతంగా వ్యాప్తి చెందుతున్న వ్యాధి
- వ్యాధి సోకిన గంటల వ్యవధిలోనే కోళ్లు మృత్యువాత
- మనుషులకూ వ్యాప్తి చెందుతుందంటున్న నిపుణులు
- చికెన్ ప్రియులు జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



బర్డ్ ఫ్లూ భయంతో ఖాళీగా ఉన్న ఓ కోళ్ల ఫారం

నకరికల్లు: నిన్నటివరకు ఆరోగ్యంగా గెంతులేస్తున్న కోళ్లు గంటల వ్యవధిలోనే మృత్యువాత పడుతున్నాయి. ఏమవుతుందో తెలుసుకునే లోపే టపాటపా రాలిపోతున్నాయి. కోడి మేత మేయకుండా మెత్తగా కన్పించడం తెల్లవారే సరికి మృతి చెందడం.. ఇది ప్రస్తుత పరిస్థితి.. దీనిని వైద్య పరిభాషలో బర్డ్ ఫ్లూ వ్యాధిగా పరిగణిస్తున్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిన గంటల వ్యవధిలోనే కోళ్లు మృతి చెందడంతో పాటు పక్కన ఉన్న కోళ్లకు సైతం సోకుతుంది. బర్డ్ ఫ్లూ సోకిన 10 కిలోమీటర్ల పరిధి వరకు ఈ వైరస్ వ్యాపిస్తుంది. కోళ్లకే కాదు మనుషులకూ ఈ వ్యాధి సోకే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. దీంతో కోళ్ల పెంపకందారులు అలాగే చికెన్ ప్రియుల్లో ఆందోళన ఆవహించింది.

వ్యాధి లక్షణాలు ఇలా...

బర్డ్ ఫ్లూ అనేది అంటు సంబంధిత వ్యాధి. ఇది సాధారణంగా కోళ్లలో వ్యాప్తి చెందుతుంది. ఒక కోడి నుంచి మరొక కోడికి క్షణాల్లో వ్యాప్తి చెంది ప్రాణాలను హరిస్తుంది. ఈ వైరస్ 10 కిలోమీటర్ల పరిధిలో వ్యాప్తి చెందుతుంది. సాధారణంగా గాలిలో మార్పు ద్వారా ఈ వ్యాధి వస్తుంది. తీవ్ర జ్వరంతో నీరసించి పోయి మేత మేయకుండా కోళ్లు కన్పిస్తాయి. వ్యాధి లక్షణాలు కన్పించిన కొద్ది గంటల వ్యవధిలోనే మృత్యువాత పడతాయి. ఒక కోడికి వ్యాధి లక్షణాలు కన్పిస్తే పక్క కోళ్లకు 90 శాతం పైగా వ్యాధి సోకే ప్రమాదముంది. మిగిలిన వాటిని కూడా తొలగించడం మంచిది.

మనుషులకూ సోకే అవకాశం

గాలి ద్వారా వ్యాప్తి చెందే బర్డ్ ఫ్లూ వ్యాధిని జూరోటిక్ డిసీజ్‌గా చెబుతారు. కోళ్లలో మాదిరిగానే మనుషుల్లో ఈ వ్యాధి సోకితే అవే లక్షణాలు కన్పిస్తాయి. తీవ్రమైన జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. సకాలంలో వైద్యం తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. వ్యాధి సోకిన కోళ్లను కోయడం ద్వారా వ్యాధి మరింత వేగంగా వ్యాప్తి చెందుతుంది. బర్డ్ ఫ్లూకు నివారణే శ్రేయస్కరమైన మార్గం.

తగ్గిన చికెన్ ధరలు

బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ ధరలు భారీగా తగ్గిపోయాయి. గత ఐదారు రోజుల క్రితం వరకు రూ.230–240 వరకు పలికిన స్కిన్‌లెస్ చికెన్ ధరలు ప్రస్తుతం గణనీయంగా తగ్గిపోయాయి. ఆది, సోమవారాల్లో రూ.130–140కు విక్రయిస్తున్నారు. ఈ ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఉన్న కోళ్లను ఎంతో అంతకు అమ్మి సొమ్ము చేసుకునేందుకు చికెన్ వ్యాపారులు ధరలు తగ్గించి ఆకర్షిస్తున్నారు.

వ్యాపారం కావడం లేదు

బర్డ్ ఫ్లూ వ్యాధి కోళ్లకు సోకుతుందన్న వార్తలు వస్తుండడంతో భయంతో చికెన్ కొనుగోలు చేసే వాళ్లు తగ్గిపోయారు. పోయిన వారం కన్నా సగం ధర తగ్గినా వ్యాపారాలు కావడం లేదు. బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రభావంతో మాలాంటి చిన్న చిన్న వాపారులు ఉపాధి కోల్పోతున్నాం.

– కోటేశ్వరరావు, చికెన్ దుకాణం, నిర్వాహకుడు, నకరికల్లు

అప్రమత్తంగా ఉండాలి



బర్డ్ ఫ్లూ వ్యాధి విపరీతంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో మాంసాహార ప్రియులు అప్రమత్తంగా ఉండాలి. గాలి ద్వారా వచ్చే బర్డ్ ఫ్లూ క్షణాల్లో ఒక కోడి నుంచి మరొక కోడికి వ్యాప్తి చెందుతుంది. వ్యాధి లక్షణాలు గుర్తించిన 10 కిలోమీటర్ల పరిధిలో దీని ప్రభావం ఉంటుంది. వైరస్ సోకిన కోడిని కోయడం ద్వారా మరింతగా వ్యాప్తి చెందుతుంది. మనుషులకు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి.

–డాక్టర్ సుజాత, పశువైద్యాధికారి, దేచవరం

గ్రామాలు సురక్షితంగా ఉండాలి



మాట్లాడుతున్న ల్యాంప్ సంస్థ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు

పెదకూరపాడు: మండల పరిధిలోని జలాలపురం గ్రామంలో స్థానిక ఎస్సీ అంగన్‌వాడీ సెంటర్‌లో మైఛాయిసెస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. ల్యాంప్ సంస్థ కో ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు, అక్రమ రవాణా గృహహింస లేని గ్రామాలే సురక్షిత గ్రామాలుగా పిలవబడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, గృహ హింస, మానవ అక్రమ రవాణా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీటిపై తల్లిదండ్రులకు అవగాహన సదస్సులో సూచనలు చేశారు. ల్యాంప్ సంస్థ ప్రోగ్రాం ట్రైనర్ ఎస్‌కే బాజీ మాట్లాడుతూ కుటుంబంలో అవగాహన కలిగిన తల్లి ఉంటే ఆ కుటుంబంలో బాల్య వివాహాలు, గృహ హింస జరగడానికి అవకాశాలు ఉండవని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త మాలతి మాట్లాడుతూ తల్లిదండ్రులు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పాటిబండ్ల గ్రామంలోని ఆర్సీఎం స్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా కామిక్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

సీఐ బొప్పన బ్రహ్మయ్య



కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో సీఐ బహ్మయ్య

సత్తెనపల్లి: చిన్నతనం నుంచే ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సత్తెనపల్లి టౌన్ సీఐ బొప్పన బ్రహ్మయ్య అన్నారు. బాపట్ల జిల్లా అద్దంకిలోని గీతా మందిర్‌లో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆర్బీ డ్రాగన్స్ ఆర్గనైజర్ పి.రాంబాబు బ్లాక్ బెల్ట్ సెవెంత్ డాన్, సీనియర్ కరాటే మాస్టర్ జి.సాయిరామ్ బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ రెఫరీలుగా వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం పట్టణంలో ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో మూడు సంవత్సరాలుగా కోచ్ రవి నేతృత్వంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు వివిధ రంగాలలో ప్రతిభ చూపారు. బాలికల విభాగంలో సందేపోగు లికిత, కె.అశ్విత, ఎస్.ధనశ్రీ, జి.మాన్విత, య.యాషి ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే ఎం.మంజుమహి, య.ఖ్యాతి, జె.జోషిత ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. అలాగే బాలుర విభాగంలో ఎ.మోనోహర్షిత్, ఎం.సాయికిరణ్, ఎస్.సోము షణ్ముక్, ఎం.సాయి ప్రణవ్, జి.సాత్విక్ ప్రథమ స్థానం సాధించగా ఆర్.గణేష్, జి.సాత్విక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్య అభినందించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆటలతో పాటు చదువు కూడా ముఖ్యమన్నారు. క్రీడల్లో కూడా రాణించటం వల్లన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ పవన్‌కుమార్, ఏఎస్ఐ పసుపులేటి సుబ్బారావు, బండారు గౌతం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

క్రీడల పోటీల్లో సెయింటాన్స్ విద్యార్థులు ప్రతిభ

క్రోసూరు: గుంటూరులో జరిగిన అంతర్ జిల్లాల ఐసీఈ స్కేటింగ్ పోటీల్లో క్రోసూరు సెయింటాన్స్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ఆ పాఠశాల హెచ్ఎం సిస్టర్ మేరీ రజిత సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు వివిధ పతకాలు పొందారన్నారు. అదే విధంగా రాజుపాలెం లోని ఎస్ఎఫ్ఎస్‌లో జరిగిన జిల్లా టెన్నిస్ బాల్, క్రికెట్ పోటీల్లో ఆరుగురు విద్యార్థులు ఎంపికైట్లు చెప్పారు. వీరందరూ ఈ నెల 21, 22, 23 తిరుపతిలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ళ: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ సోమవారం చెప్పారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబర్‌తో రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఆయా వివరాలను ఆన్‌లైన్ చేయటంతో రైతుకు ఐడీ నంబర్ వస్తుందన్నారు. ఈ నంబర్ వలన అనేక ప్రయోజనాలున్నాయని, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రాయితీలు పొందే అవకాశం ఉంటుందన్నారు. రైతులు త్వరితగతిన రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఇంటింటికి ఆరోగ్యం

పిడుగురాళ్ల: పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఇంటింటికి ఆరోగ్యం సర్వేను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే పట్టణంలోని 11వ సచివాలయ పరిధిలోని చిలిరాల వీధిలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వే డోర్ టూ డోర్ ఆరోగ్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ సర్వేలో ప్రజలకు బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ, హెచ్‌బీ వంటి పరీక్షలు నిర్వహించి, అనారోగ్య సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. తద్వారా వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు అవకాశం ఉంటుందని సచివాలయ హెల్త్ సెక్రటరీ ఎస్‌కే బషీరూన్ తెలిపారు. ఆశ కార్యకర్తలు ఎం.శ్వేత, ఎస్.శారదా పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ



నులిపురుగు నివారణ మాత్రలను అందిస్తున్న జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో రెండవ విడత నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ సోమవారం పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల్లో మొదటి విడతలో మింగని విద్యార్థులచే మాత్రలు మింగించారు. ముందుగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మండలంలో నూరు శాతం నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేసి మింగించినట్లు ఆయన తెలిపారు. దమ్మాలపాడులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. సూపర్‌వైజర్ పీటర్‌డేమియన్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంటనే పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారావు

మాచర్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు కోరారు. సోమవారం పట్టణంలోని పెన్షనర్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వంలో పెన్షనర్లకు ఎంతో నష్టం జరిగిందన్నారు. క్వాంటం ఆఫ్ పెన్షన్‌ని తగ్గించి ఎంతో నష్టపరచారని వెంటనే సరిచేయాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నందా నరసింహ్మయ్య మాట్లాడుతూ ఈహెచ్ఎస్ కార్డుపై ఉచిత వైద్యం దక్కడం లేదన్నారు. అది యథాస్థితిపై పునరుద్ధరించాలని కోరారు. మూడు డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని కోరారు. ఇకపై ప్రతి నెల వారి సమావేశంలో డాక్టర్ రామలింగారెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, ట్రెజరర్ షేక్ గాలిబ్, సహాయ కార్యదర్శి అంజయ్య, వెంకటరెడ్డి, నారాయణ, లక్ష్మణరావు, రవికాంత్, జాని, వెలుగొండరెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మాచర్ల: ఉద్యోగులకు గత ఆరు సంవత్సరాలుగా రావాల్సిన డీఏ ఎరియర్స్ వెంటనే విడుదల చేయాలని ఏపీసీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బాజీ పఠాన్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డాక్టర్ సాంబేలు శాంతి బాయి సీఎఫ్ఎంఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేసి సమస్యను తెలిపారు. వారు మాట్లాడుతూ 12 డీఏ బకాయిలు వాయిదా వేయడం అన్యాయమన్నారు. ప్రతి ఉద్యోగి ఆత్మగౌరవంతో వృత్తిని నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే వారికి న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. నివాస్‌ను కలిసిన వారిలో హుస్సేన్, నాగేశ్వరరావు, బాలాజీ నాయక్, యూనియన్ నాయకులు ఉన్నారు.

కరాటేలో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ



దాచేపల్లి : స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపించారని ప్రిన్సిపల్ ఎస్. రవికుమార్ సోమవారం తెలిపారు. ఆర్‌బీ డ్రాగన్స్ బుడోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో బాల, బాలికలకు అద్దంకిలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న చెట్టిపాగు మిషిత బ్లెస్సీ గ్రూప్–ఏ బాలికల విభాగంలో మొదటిస్థానం, గ్రూప్–బీ విభాగంలో సువర్ణ రెండవ స్థానం, గ్రూప్ సీ నుంచి ఎల్.శరణ్య మొదటిస్థానం, గ్రూప్ డీ నుంచి మురికిపూడి ఆలేఖ్య మూడవ స్థానం, గ్రూప్ ఎఫ్ నుంచి చెట్టిపాగు రితీష్ రెండవ స్థానంలో నిలిచారని ఆయన వెల్లడించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను కోచ్ మీసాల అచ్చయ్య, పీఈటీ బాలాజీనాయక్ అభినందించారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

ఎస్ఐ నాగేంద్రరావు



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాగేంద్రరావు

క్రోసూరు: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పక హెల్మెట్ ధరించండి, ప్రాణాలు కాపాడుకోండి అని ఎస్ఐ నాగేంద్రరరావు సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. రోడ్డు పై ప్రయాణించేటప్పుడు ప్రాణాపాయ ప్రమాదాల నుంచి హెల్మెట్ కాపాడుతుందని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపటం, మద్యం తాగి నడపటం, మైనర్లు వాహనాలు నడపటం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడపటం కారణంగా ప్రమాదాలు జరిగి తల రోడ్డుకు తగిలి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్న విషయం అందరికీ తెలుసునన్నారు. కావున ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని తెలియజేశారు. రవాణా చట్టం ప్రకారం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే అధిక జరిమానా విధించటం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారు హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలి

జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సిద్దలింగమూర్తి



మాట్లాడుతున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ లింగమూర్తి

సత్తెనపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని పల్నాడు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్దలింగమూర్తి అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పీడీ లింగమూర్తి ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడం, సరాసరి వేతనం, గోకుల షెడ్లు, శ్రమశక్తి సంఘాలు, గృహ నిర్మాణాలకు 90 రోజుల పని దినాలు, ఉద్యానవన పంటలు, లేబర్ బడ్జెట్‌పై అంశాల వారీగా సమీక్ష చేశారు. సమావేశంలో సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాస రెడ్డి, రాజుపాలెం ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, నకరికల్లు ఎంపీడీవో కాశయ్య, సత్తెనపల్లి క్లస్టర్ ఏపీడీ ఇన్‌చార్జ్ పాత్తూరి వెంకటనారాయణ, నియోజకవర్గంలోని ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు

ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్ రెడ్డి



ఎరువులు తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: ఎమ్మార్పీకి మించి యూరియా, ఇతర ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలు గోదాముల్లో ఎరువులను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రబీ సీజన్‌లో వరి 2 వేల ఎకరాలు, మొక్కజొన్న 5,500 ఎకరాల్లో సాగు అవుతుందన్నారు. ఈ దశలో పంటలకు అవసరం మేరకు రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో యూరియా, ఎరువులు కొరకు ఇండెంట్ పెట్టామని తెలిపారు. రెండు రోజుల్లో యూరియా నిల్వలు అన్ని రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ఇదే అదనుగా భావించి ప్రైవేట్ డీలర్లు యూరియా, ఎరువులను రైతులకు ఎమార్పీకి మించి అధిక ధరలకు విక్రయించినట్లయితే వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఆయనతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పక్కాగా.. ఓటర్ల లెక్క

- తేలిన గ్రాడ్యుయేట్ ఓటర్ల సంఖ్య
- డివిజన్‌లో 17,045 మంది ఓటర్లు.. 23 పోలింగ్ కేంద్రాలు



సత్తెనపల్లిలోని పాత కేంద్రీయ విద్యాలయంలో పోలింగ్ కేంద్రం

సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ (పట్టభద్రుల) ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్కార్ సన్నద్ధమవుతోంది. దీనిలో భాగంగా ఓటర్ల నమోదు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసింది. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో 17,045 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నట్లు లెక్క తేలింది. సహజంగా జనరల్ ఓటర్ల జాబితాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం చూస్తుంటాం. గ్రాడ్యుయేట్ ఓటర్లు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నారు. మహిళలకు యుక్త వయస్సు రాగానే పెళ్లిళ్లు చేయడంతో పాటు ఉన్నత చదువులు ఆపివేయడం వంటి కారణాలతో మహిళల సంఖ్య తక్కువగా కనిపిస్తోంది.

రెవెన్యూ డివిజన్ పరిధిలో...

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక పట్టణం, 9 మండలాలు ఉన్నాయి. ఈ డివిజన్ పరిధిలోకి సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలు వస్తాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు,పెదకూరపాడు నియోజకవర్గంలో పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలు ఉన్నాయి. డివిజన్ వ్యాప్తంగా 17,045 మంది ఓటర్లు ఉంటే వీరిలో పురుషులు 11,376 మంది, మహిళలు 5,667 మంది, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఉన్నట్లు లెక్క తేల్చారు. తొలుత గత ఏడాది నవంబర్ 6 వరకూ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వస్తుండటంతో 8వ తేదీ వరకూ పొడిగించింది. నవంబర్ 23వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ముద్రించారు. దరఖాస్తులు అధిక సంఖ్యలో వస్తుండటంతో డిసెంబర్ 9వ తేదీ గడువుగా నిర్ణయించారు. అభ్యంతరాలు స్వీకరించి 30న తుది జాబితా వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాలు ఇలా...

డివిజన్‌లో మొత్తం 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. వీటిలో సత్తెనపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 342, 343, 344, 344–ఏ, 345, 345–ఏ, సత్తెనపల్లి రూరల్‌లో పాత కేంద్రీయ విద్యాలయంలో 346, 347, ముప్పాళ్ళ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 348, 349, రాజుపాలెం ఎంపీపీ స్కూల్‌లో 350, 351, నకరికల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 352, 353 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే పెదకూరపాడు 339, అమరావతి 337, 338, అచ్చంపేట 334, 335, 336, క్రోసూరు 340, 341, బెల్లంకొండలో 333 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో అత్యధికంగా ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. అత్యల్పంగా పెదకూరపాడు, బెల్లంకొండ మండలాల్లో ఒక్కొక్క పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

పురుష ఓటర్లే అధికం

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో మహిళా ఓటర్ల కంటే 5,709 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. సత్తెనపల్లి టౌన్‌లో అత్యధికంగా 2,514 మంది పురుష ఓటర్లు, 1,612 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ఒకరు ఉండగా అత్యల్పంగా బెల్లంకొండలో 458 మంది పురుష ఓటర్లు, 156 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.


క్లుప్తంగా

సేవాతత్పరుడు జాన్సన్‌కు సత్కారం



సత్తెనపల్లి: మదర్ థెరిస్సా ఆదరణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, సేవా తత్పరుడు చిలుక జాన్సన్‌ను గుంటూరులోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ దేవిరెడ్డి కిరణ్మయి, పర్యవేక్షకులు బి.సీతారాం సోమవారం సత్కరించారు. ఓ వైపు ఉద్యోగం చేస్తూ జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు పొందటమే కాక జాన్సన్ అందిస్తున్న సేవలను కొనియాడి భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాన్సన్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి మెమెంటో అందించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం సిబ్బంది తదితరులు ఉన్నారు.

కనుల పండువగా భక్తాంజనేయుని వార్షిక వేడుకలు



సత్తెనపల్లి: పట్టణంలోని 25వ వార్డు మహారాష్ట్ర వీధిలో వేంచేసియున్న భక్తాంజనేయ స్వామి వారి దేవస్థానం 25వ వార్షిక వేడుకలు రెండవ రోజు సోమవారం కనుల పండువగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచే ఆలయ అర్చక స్వామి శ్రీమాన్ వేదాంతం విజయనరసింహాచార్యులు పూజలు ప్రారంభించి, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యాధి ప్రాసన, మూలమంత్ర సహిత హనుమత్ హోమం, పుష్పయాగం నిర్వహించారు. మధ్యాహ్నం నీరాజనం, మంత్రపుష్పం, తీర్థగోష్టి చేపట్టారు. సాయంత్రం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అష్టోత్తర శతనామ పూజలు, సత్తెనపల్లి వేద గాయత్రి పరివార్ శ్రీశ్రీశ్రీ ఫిరోజి రుషీంద్రుల మఠం వారి సమర్పణలో రాత్రి కోటి వత్తులతో దీపోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కస్టమర్ కేర్, డేటా ఎంట్రీ కోర్సులకు దరఖాస్తులు

క్రోసూరు: క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో కస్టమర్ కేర్ డొమెస్టిక్ వాయిస్ కోర్సు, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు శిక్షణనిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి అధికారి జి.తమ్మాజిరావు సోమవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పదవ తరగతి ఆపైన చదువుకున్న (18–45 వయస్సు) నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కోర్సులో చేర దలిచిన వారు మార్క్స్ సర్టిఫికెట్ జిరాక్స్‌లు, బయోడేటా, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, కాలేజీలో అందజేయాలని కోరారు. వివరాలకు అంజిరెడ్డి 7779858789ని అడిగి తెలుసుకోవాలన్నారు. 50 రోజుల పాటు జరిగే శిక్షణ కాలం పూర్తిచేసుకున్న వెంటనే సర్టిఫికెట్‌తోపాటు ఉపాధి కల్పించబడుతుందన్నారు.

రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ సోమవారం పరిశీలించారు. ఎంత మేర సర్వే పూర్తయిందో రికార్డులు పరిశీలించారు. సర్వే జరుగుతున్న భూమికి సంబంధించి రైతులతో మాట్లాడి, ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వే జరిగే ప్రాంతంపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. రైతులు కూడా భూములకు సంబంధించిన ఆధారాలను సర్వే సిబ్బందికి అందించి సహకరించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ టి.సుధాకర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: డాక్టర్ గజ్జల



నకరికల్లు: అకాలమృతికి గురైన కార్యకర్తల కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామని సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి భరోసానిచ్చారు. నకరికల్లుకు చెందిన కార్యకర్త దేపంగి బాబు భార్య సుజనమ్మ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఆయన నకరికల్లుకు చేరుకుని సోమవారం సుజనమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దూదేకుల బాషా, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.